
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 6 । నవంబర్ । 2024



సోమశిలలో 70.223 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 70.223 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2,300, ఉత్తరకాలువకు 700, కండలేరుకు 10 వేలు, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్ల (10 గ్రా)	రూ.81,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,380
3 శాతం జీఎస్టీతో	రూ.7,601
నవర (8 గ్రా)	రూ.60,808

గరిష్టం/కనిష్టం
34.4 /25.4

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం. మంగళవారం గాలిలో తేమ 65 శాతం ఉంది.

న్యూస్‌రీల్

వృద్ధులను ఆదరించడం అందరి బాధ్యత

• సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి



వృద్ధురాలితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

నెల్లూరు (అర్బన్): మలిదశలో ఉన్న వృద్ధులను ఆదరించడం మన అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. మంగళవారం మాగుంట లేఅవుట్‌లోని వీర వృద్ధుల ఆశ్రమాన్ని జడ్జి వాణి పరిశీలించారు. వృద్ధులను పరామర్శించారు. అనంతరం అక్కడ నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులను చేసి పెళ్లిళ్లు చేశాక అనేక మంది తమ తల్లిదండ్రులను నిరాదరించడమే కాకుండా బయటకు గెంటేయడం బాధాకరమన్నారు. ఇలా చేయడం క్షమించరాని నేరమన్నారు. వృద్ధుల రక్షణకు 2007లో సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోషణ భారం, బాగోగులు వారి బిడ్డలు, మనుమళ్లు, మనువరాళ్లు, వారి నుంచి ఆస్తులు పొందే ప్రతి ఒక్కరిదన్నారు. అలా ఆదరించకపోతే చట్టరీత్యా ఇబ్బందులు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీలు

కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర కబడీ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం వరకు పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు సిద్ధం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

10న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా రెసిడెన్షియల్ విధానంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఈ నెల 10న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నామని ఎస్సీ సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి బి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెస్ట్ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో ఆరు కళాశాలల్లో జరుగుతుందన్నారు. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, జెనెక్స్ విజన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ టెక్నాలజీ కళాశాల, గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, కావలి పట్టణంలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, కావలిలోని మద్దూరుపాడు డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల, కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలల్లో టెస్ట్ జరుగుతుందన్నారు. హాల్ టికెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలుంటే 95816 30003 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రశ్నించే గొంతుపై ఉక్కుపాదం

టీడీపీ నేతల అవినీతి బయటపడుతుందని కాకాణి గృహ నిర్బంధం

- టెండర్లు ఖరారు కాకుండానే కనుపూరు కాలువ పనులు
- సూరాయపాళెం ఇసుక రీచ్‌లో తమ్ముళ్ల ధనదాహానికి గిరిజనుడి బలి
- ఆ కుటుంబాన్ని పరామర్శించి, అక్రమ పనుల పరిశీలనకు కాకాణి సిద్ధం
- వెళ్లనివ్వకుండా కాలువ వద్ద మోహరించిన టీడీపీ మూకలు
- ఫ్లెక్సీలు చించి, టెంట్లు కూల్చి, కుర్చీలు కాలువలో పడేసి వీరంగం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి యత్నం
- ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసుల ముందస్తు చర్యలు

సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి కనుసన్నల్లో షాడో ఎమ్మెల్యే నేతృత్వంలో అవినీతి, అక్రమాలు, దందాలు మితిమీరాయి. ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీ, మద్యం వ్యాపారంతో ప్రారంభమైన అరాచకాలు తాజాగా రైతులకు సాగునీటి పారుదల పేరుతో రూ.పాతిక కోట్లు దోచుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. మాయా టెండర్ల మాటున కాలువల్లో తూతూ మంత్రంగా పూడిక తీసి నిధులు దారి మళ్లించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. షాడో ఎమ్మెల్యే ఇసుక దోపిడీ దాష్టీకానికి ఓ గిరిజనుడి కుటుంబం బలైపోయింది. అవినీతి పనులను పరిశీలించి, ఆ గిరిజనుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు బయల్దేరిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసుల సహకారంతో హౌస్ అరెస్ట్ చేయించి ఉక్కుపాదం మోపారు. టీడీపీ మూకలతో కాలువ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు సృష్టించారు.



బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులను ప్రశ్నిస్తున్న కాకాణి

కాకాణి హౌస్ అరెస్ట్

కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటన విషయం తెలుసుకున్న టీడీపీ కీలక నేతలు ఆయన పర్యటనను పోలీసులతో బలప్రయోగం చేయించి ఆయన్ని గృహ నిర్బంధంలో ఉంచారు. మంగళవారం ఉదయం నుంచి కాకాణి ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు ఆయన్ను బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. కాకాణి హౌస్ అరెస్ట్ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఆయన అభిమానులు భారీగా తరలిరావడంతో ఆయన నివాసం వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాము సామరస్యంగా వెళ్లి కాలువ పనులు పరిశీలన చేస్తే తప్పేమిటని పోలీసులను కాకాణి ప్రశ్నించారు. వారు మాత్రం కాకాణి వెళ్లేందుకు ససేమిరా అని గృహ నిర్బంధంలో ఉంచారు. నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కాకాణి నివాసానికి చేరుకుని ఆయనకు అండగా నిలిచారు.



గృహ నిర్బంధంలో మీడియాతో మాట్లాడుతున్న కాకాణి



కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఎమ్మెల్యేల నుంచి మంత్రుల వరకు అవినీతి, అక్రమాల్లో మునిగి తేలిపోతున్నారు. టీడీపీ దోపిడీలు, దాష్టీకాలను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తరచూ ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయన తనయుడు సహజ వనరుల నుంచి ప్రజా సంపద వరకు చేస్తున్న దోపిడీపై కాకాణి నిలదీస్తున్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకయ్యారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేతలతో ఇప్పటికే కాకాణిపై కేసులు నమోదు చేయించారు. తాజాగా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేతలు వ్యవసాయ రంగానికి జీవనాడి లాంటి సాగునీటి కాలువలకు తాత్కాలిక మరమ్మతులు, పూడిక తీత పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆయా పనులకు పారదర్శకంగా టెండర్లు ఆహ్వానించినా.. ఏకపక్షంగా ఆ పనులు తామే చేపట్టే విధంగా టెండర్లు ఖరారు కాకుండానే తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను కాలరాసి కాలువల్లో కాసులు దోపిడీ చేస్తుంటే.. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం మిన్నకుండిపోయింది. సర్వేపల్లి నియోజకవర్గానికి సాగునీటిని అందించే సంగం ఆనకట్ట వద్ద నుంచి కనుపూరు కాలువ పూడికతీత పనుల్లో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిద్ధమయ్యారు. అయితే కాకాణి అక్కడికి వెళ్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని భావించిన టీడీపీ నేతలు పొదలకూరు మండలంలోని కనుపూరు కాలువ వద్ద పనుల పరిశీలన కార్యక్రమాన్ని పోలీస్ బలప్రయోగంతో కాకాణిని హౌస్ అరెస్ట్ చేసి అడ్డుకోవడం జిల్లాలో సంచలనంగా మారింది.

రూ.25 కోట్ల దోపిడీకి ప్రణాళిక

సర్వేపల్లి నియోజకవర్గంలో ఓఅండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) ద్వారా సాగునీటి కాలువలకు తాత్కాలిక మరమ్మతులు, పూడికతీత పేరుతో దాదాపు రూ.25 కోట్లకు ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా అత్యవసర పనుల పేరుతో 23 కాలువల్లో పూడికతీత, మరమ్మతులకు దాదాపు రూ.6 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఆయా పనులకు టెండర్లకు ఆహ్వానించారు. ఈ నెల 11వ తేదీ వరకు టెండర్ల గడువు ఉంది. కానీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాకముందే టీడీపీ నేతలు ఆయా పనులను ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలను కాలరాసి యంత్రాలతో కాలువ పూడిక తీత పనులను మమ అనిపిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు లేకుండా పనులు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఆయా కాలువలకు సాగునీరు వదిలే అవకాశం ఉండడంతో పనుల నాణ్యత పరిశీలించే అవకాశం కూడా ఉండదనే కారణంతో హడావుడిగా పనులు చేసినట్లు చూపి నిధులు ఆరగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై, గుట్టు చప్పుడు కాకుండా పనులు చేస్తున్న విషయం మాజీమంత్రి కాకాణి దృష్టికి రావడంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదు. పలు పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు మిన్నకుండిపోయారు.

ఇసుక తవ్వకాలకు గిరిజనుడు బలి

సంగం ఆనకట్ట సమీపంలో పొదలకూరు మండలం సూరాయపాళెం వద్ద టీడీపీ నేతల ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంతలో పడి రెండు రోజుల క్రితం ఓ గిరిజనుడు మృత్యువు పాలయ్యాడు. ఆ గిరిజన కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పాలని, పొదలకూరు మండలంలోని కనుపూరు కాలువ పనులు పరిశీలించాలని కాకాణి సిద్ధపడ్డారు. ఆయన అక్కడికి వెళ్తే తమ అవినీతి రంగు ఎక్కడ బయట పడుతుందోనని టీడీపీ నేతలు భయపడ్డారు.

సోమిరెడ్డి అవినీతిపై పోరాటం ఆగదు

• మాజీ మంత్రి కాకాణి

తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాము సోమిరెడ్డిని అడ్డుకుని ఉంటే అల్లీపురం నుంచి కూడా బయటకు రాలేపోయేవాడు. తాను కాలువ సందర్శనకు వెళ్లానంటే సోమిరెడ్డి అవినీతి ఎక్కడ బహిర్గతం అవుతుందోనని భయపడి పోలీసులను పురమాయించాడు. నన్ను పోలీసులను అడ్డు పెట్టుకుని అడ్డుకున్నా.. సోమిరెడ్డి అవినీతిపై తన పోరాటం ఆగదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కాకాణిని నెల్లూరులోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సోమిరెడ్డి విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ రూ.కోట్లు దోచుకుంటుంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కాలువల పనులకు సంబంధించి ఈ నెల 11వ తేదీ వరకు టెండర్ల దాఖలుకు గడువు ఉన్నప్పటికీ ముందుగానే పనులు ప్రారంభించి నామమాత్రంగా చేస్తూ రూ.కోట్లు కొల్లగొట్టడానికి వేసిన స్కెచ్‌ను అడ్డుకునేందుకు కాలువ సందర్శించడానికి వెళ్లాలంటే పోలీసుల అనుమతి అవసరమా అని ప్రశ్నించారు. డ్రెడ్జింగ్ కోసం తీసిన గుంతలో పడి అమాయక గిరిజనుడు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు సోమిరెడ్డి పోలీసులను అడ్డు పెట్టుకుని మమ్మల్ని ఆపుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు టీడీపీ నేతలకు తొత్తులుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాకాణి వెంట ఎవరైనా వెళ్తే 307 సెక్షన్ కింద కేసులు పెడతామని పోలీసులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని చెప్పారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే పరిశీలించేందుకు వెళ్లాలనుకుంటే పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ఎవరి బలం ఏమిటో తాము అక్కడే తేల్చుకుంటామని, టీడీపీని ప్రజాబలంతో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలుసుకుని సోమిరెడ్డి దోపిడీ ప్రజలకు తెలియజెప్పడానికి బయలుదేరుతున్న తమను అడ్డుకోవడంతోనే కూటమి ప్రభుత్వ నైజం బయటపడిందన్నారు. సోమిరెడ్డి అవినీతిపై పోరాటం కొనసాగుతుంది తప్ప వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.





కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసానికి చేరుకుంటున్న వేదాయపాళెం పోలీసులు, నివాసంలో ఉన్న పోలీసులు

ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బంది సస్పెన్షన్

నెల్లూరు (క్రైమ్): ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. నగరానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె పైనే లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మహిళా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు జిల్లా జైల్లో ఉన్నాడు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామారావు, కానిస్టేబుల్స్ విజయకుమార్, మోహన్‌రావు విచారణ నిమిత్తం నిందితుడిని కోర్టుకు తీసుకెళ్లారు. తిరిగి జైలుకు తీసుకెళ్లే క్రమంలో నిందితుడిని అతని ఇంటికి తీసుకెళ్లారు. భార్య వల్లే తాను జైలుకెళ్లానని కోపోద్రిక్తుడైన నిందితుడు భార్యపై దాడి చేశాడు. ఈ విషయాన్ని బాధితురాలు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా ముగ్గురు ఎస్కార్ట్ సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

సహకార రంగం ద్వారానే జిల్లా సమగ్రాభివృద్ధి

• కలెక్టర్ ఆనంద్



నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో సహకార సంఘాలను పటిష్ట పరిచి, సభ్యులకు మంచి సేవలందించడం ద్వారా ఆర్థిక సామాజిక సాధికారత దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలోని 78 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని రికార్డుల కంప్యూటరీకరణ చివరి దశకు వచ్చిందని, పీఏసీఎస్‌ల కంప్యూటీకరణతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఆన్‌లైన్ సేవలకు, కోర్ బ్యాంకింగ్ సేవలకు అనుసంధానం జరిగి సభ్యులకు రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, ఇతర శాఖలతో పథకాలు పొందడానికి వీలవుతుందన్నారు. ప్రత్యేకించి సంఘంలో రికార్డుల పారదర్శకత, జవాబు దారీతనం, ఆర్థిక మోసాలు అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో నెల్లూరు, ప్రకాశం డీసీసీబీలను అనుసంధానించడం జరిగిందన్నారు. ప్రపంచ వికేంద్రీకత ఆహార భద్రతా పథకం కింద పడుగుపాడు పీఏసీఎస్ పరిధిలో అతి పెద్ద ధాన్యం నిల్వ కేంద్రం మంజూరైందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి గురప్ప, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి రమేష్‌నాయక్, నాబార్డు ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.

కరెంట్.. సర్దుపోటు


- యూనిట్‌పై రూ.1.50 చొప్పున చార్జీల మోత
- జిల్లా ప్రజలపై ట్రూఅప్ భారం నెలకు రూ.8 కోట్లు
- నవంబర్ నుంచి పదిహేను నెలల పాటు వసూలు
- రెండో విడత సర్దుబాటు చార్జీలకూ 'ఏపీఈఆర్‌సీ' సిద్ధం
- ఈ భారం దాదాపు రూ.240 కోట్ల వరకు ఉండే అవకాశం
- 11 లక్షల మంది వినియోగదారులకు షాక్

జిల్లా ప్రజలకు ఈ నెల నుంచే కరెంట్ బిల్లుల షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం దీపావళి కానుకగా ట్రూఅప్ సర్దుబాటు పేరుతో చార్జీల మోత మోగిస్తోంది. తమ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే చార్జీల భారాన్ని తగ్గిస్తామంటూ కోతలు కోసిన చంద్రబాబు.. ఐదు నెలలు తిరగక ముందే తన అసలు రూపాన్ని బయట పెట్టుకున్నారు. ఈ నవంబర్ నుంచి 2026 జనవరి వరకు పదిహేను నెలల పాటు విద్యుత్ చార్జీల భారాన్ని సామాన్యుల నుంచి సంపన్నుల వరకు భరించక తప్పని పరిస్థితి అనివార్యమవుతోంది.

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ వినియోగదారులకు కరెంట్ సర్దు'పోటు' భారంగా మారింది. నవంబర్ బిల్లుల నుంచే యూనిట్ వినియోగంపై రూ.1.50 వంతున చార్జీలు పెరిగాయి. గత నెల వరకు 100 యూనిట్ల విద్యుత్ వినియోగానికి అన్ని చార్జీలు కలుపుకుని రూ.270 వస్తే.. ఈ నెలలో అవే యూనిట్లకు రూ.438 బిల్లు వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ రంగంలో చేసిన అక్రమాలు, తప్పిదాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరిదిద్దింది. అయితే ఆ బిల్లులే అధికమంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, కూటమి నేతలు గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ వినియోగదారులకు మంచి చేస్తామని, విద్యుత్ చార్జీలు పెంచమని అవసరం అయితే 30 శాతం మేర చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చింది. వీటితో పాటు గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలకు మించి సాయం చేస్తామంటూ ఉచిత హామీలు గుప్పించింది. కూటమి నేతల హామీలు నమ్మి గెలిపించిన ప్రజలకు అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే చుక్కలు చూపిస్తూ విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. విద్యుత్ సర్దుబాటు, ట్రూఅప్ పేరుతో వినియోగదారులపై చార్జీల మోత మోగించేందుకు సిద్ధపడింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ప్రతి నెల విద్యుత్ బిల్లుల్లో రూ.150 నుంచి రూ.450 అదనంగా పెరగనుంది.

పదిహేను నెలలకు రూ.120 కోట్ల భారం

జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 12,81,761 విద్యుత్ సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఉన్న 2,00,448 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు ట్రూఅప్ చార్జీలు మినహాయింపు ఉంది. ఇక మిగిలిన 10,81,313 సర్వీసులకు ట్రూఅప్ చార్జీల భారం పడనుంది. నెలకు 100 యూనిట్లు వాడే వినియోగదారుడికి ప్రతి నెలా వచ్చే విద్యుత్ బిల్లుతో పాటు అదనంగా మరో రూ.150, 200 యూనిట్లు వినియోగించే వినియోగదారుడికి రూ.300, 300 యూనిట్లు వాడే వినియోగదారుడికి మరో రూ.450 అదనపు భారం పడనుంది. ఈ లెక్కన జిల్లాలో వినియోగించే యూనిట్ల విద్యుత్‌పై నెలకు సగటున రూ.8 కోట్ల భారం పడుతోంది. సర్దుబాటు చార్జీలను 15 నెలల పాటు పెంచేలా విద్యుత్ సంస్థలకు అనుమతి ఇవ్వడంతో 15 నెలలకు రూ.120 కోట్లు అదనపు భారం పడనుంది.



జిల్లాలో సర్వీసులు ఇలా..

కేటగిరీ-1 (గృహ సర్వీసులు)	9,42,905
కేటగిరీ-2 (దుకాణాలు, వ్యాపార సర్వీసులు)	1,07,800
కేటగిరీ-3 (పరిశ్రమలు)	4,172
కేటగిరీ-4 (స్ట్రీట్ లైట్లు, వాటర్ వర్క్స్)	26,436
కేటగిరీ-5 (అగ్రికల్చర్)	2,00,448
మొత్తం సర్వీసులు	12,81,761

రెండో విడతలో రెండింతల భారం

తాజాగా విధించిన ట్రూఅప్ చార్జీల భారం నవంబర్ నుంచే ప్రారంభమైంది. రెండో విడతలో రెండింతలు అధికంగా ట్రూఅప్ చార్జీలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఏపీఈఆర్‌సీ అభ్యంతరాలపై ప్రభుత్వానికి అవకాశం కల్పించింది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.6072.86 కోట్లు వసూలు చేస్తుండగా, అందులో జిల్లా వినియోగదారులపై రూ.120 కోట్లు పడుతోంది. రెండో విడతలో రూ.11,826.15 కోట్లు వసూలు చేయడానికి రంగం సిద్ధం చేస్తోంది. ఈ లెక్కన జిల్లా ప్రజలపై దాదాపు రూ.240 కోట్ల వరకు భారం పడే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే తొలి విడత సర్దుబాటు వసూలు 2026 జనవరి వరకు చేయనున్న నేపథ్యంలో రెండో విడత సర్దుబాటు చార్జీలు ఈ షెడ్యూల్ తర్వాత వసూలు చేస్తారా? మధ్యలోనే కలుపుతారా అనేది త్వరలోనే స్పష్టత రానుంది.

సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేసింది. నిత్యావసరాల నుంచి కూరగాయలు, వంట నూనెలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది చాలదన్నట్లుగా అదనంగా విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై పెంచడం దారుణం. జిల్లా ప్రజలపై 15 నెలలకు రూ.120 కోట్లు విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి.

– దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్

కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి మోసమా



గత ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారు. ఇంకా చార్జీలు తగ్గిస్తామని చెప్పి.. అధికారం చేజిక్కగానే పేద, మధ్య తరగతి నడ్డి విరిచేలా నెలకు రూ.8 కోట్లు భారం మోపడం సరికాదు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచకూడదు. పెంచిన చార్జీలు తగ్గించకపోతే ఆందోళనలు చేస్తాం.

– కత్తి పద్మ, ఐద్వా నగర కార్యదర్శి

ఉల్లాస్‌ంగా.. ఉత్సాహంగా

- నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు..
- ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యపై అవగాహన
- జిల్లాలోని 37 మండలాల్లో 19,178 మంది పొదుపు మహిళలు
- శిక్షణ ఇవ్వనున్న 1900 మంది వలంటీర్లు




పొదుపు మహిళల సమావేశం (ఫైల్)

కావలి: నిరక్షరాస్యులైన మహిళలకు వృత్తిపరమైన అంశాలతో పాటు ఆర్థిక వ్యవహారాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించాలనే లక్ష్యంతో అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొదుపు సంఘాల మహిళలు, అన్ని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ, ఎయిడెడ్ పాఠశాలల సహాయకులు, వంట పని చేసేవారు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకులు, హెల్పర్లు తదితరుల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

విడతల వారీగా..

ఈ కార్యక్రమం మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. అన్ని విభాగాలకు సంబంధించిన వారికి ఒకేసారి శిక్షణ ఇవ్వడం ఇబ్బందిగా మారే అవకాశం ఉండటంతో విడతల వారీగా నిర్వహించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా తొలి విడతగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పొదుపు మహిళల శిక్షణపై దృష్టి సారించారు. 37 మండలాల్లోని 19,178 మంది పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణను రూపొందించారు.

వలంటీర్ల నియామకం

పొదుపు మహిళల్లో అక్షరాస్యులను గుర్తించి వారినే వలంటీర్‌గా నియమించారు. ఒక్కో వలంటీర్ పది మంది మహిళలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ తరహాలో జిల్లాలో 1900 మంది వలంటీర్లను గుర్తించి వారికి శిక్షణనూ ఇచ్చారు. రోజూ రెండు గంటలు.. అంటే సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఏడు.. లేదా సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహించొచ్చు. శిక్షణ ప్రక్రియను 200 గంటలు పాటు నిర్వహించాల్సి ఉంటుంది.

పరీక్ష.. ఆపై సర్టిఫికెట్

అంగన్‌వాడీ కేంద్రాలు లేదా అందుబాటులో ఉండే ఇతర ప్రభుత్వ భవనాల్లో శిక్షణను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని పొదుపు మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించి 19,178 మందికి శిక్షణను వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ముగించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో పరీక్షను మార్చిలో నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి 'చదువు వచ్చు' అనే సర్టిఫికెట్‌ను ప్రదానం చేయనున్నారు.

విద్యావంతులైతేనే సమాజాభివృద్ధి



చదువు రాని మహిళలను గుర్తించి వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైతేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ప్రాథమిక అక్షరాస్యతతో పాటు నిత్య జీవితంలో ఉపయోగపడే డిజిటల్, ఆర్థిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది.

– మహమ్మద్ ఆజాద్, జిల్లా వయోజన విద్యాశాఖ ఉప సంచాలకుడు, నెల్లూరు

శిక్షణ ఇలా..

ఎంపీడీఓ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కార్యక్రమ సమన్వయానికి సూపర్‌వైజర్లనూ నియమించారు. పొదుపు మహిళల్లో నిరక్షరాస్యులైన 15 ఏళ్లపైబడిన వారందరూ శిక్షణకు అర్హులే. చదవడం, రాయడంతో పాటు వారి జీవనోపాధికి అవసరమయ్యే లెక్కల్లో శిక్షణ ఇస్తారు. డిజిటల్, ఫైనాన్షియల్, ఫంక్షనల్ అనే అంశాల్లో తర్ఫీదును ఇవ్వనున్నారు. దీనికి గానూ టీసీఎస్ ద్వారా ఒక ప్రత్యేక ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. వాస్తవానికి శిక్షణను మంగళవారం నుంచే ప్రారంభించాలని తొలుత నిర్ణయించారు. అయితే పుస్తకాలు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ప్రారంభం కాలేదు.

సమాచారాన్ని యాప్‌లో పొందుపర్చాలి



సమావేశానికి హాజరైన అధికారులు

కావలి: పొదుపు సంఘాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో పొందుపర్చాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. కావలి పురపాలక సంఘంలో పనిచేస్తున్న సిబ్బంది, రిసోర్స్ పర్సన్లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు పేదరికం నుంచి బయటపడేందుకు.. ఆర్థిక ప్రణాళికలను తయారు చేసేందుకు గానూ ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రతి నెలా విక్రయించేందుకు గానూ ఏఎస్‌డీసీ, అర్బన్ మార్కెట్ ద్వారా అవకాశం కల్పించామని వెల్లడించారు. కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఐబీ అంకయ్య, టీఈ ఎస్సెస్ కాంతయ్య, ఐటీ యాంకర్ పర్సన్ శంకర్, సీఎంఎం భారతి, సీఓలు కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్న, శైలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదపవనిలో భారీ చోరీ

- 37 సవర్ల బంగారం, 2.5 కిలోల వెండి అపహరణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ సుబ్రహ్మణ్యం

లింగసముద్రం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులను పగలగొట్టి లాకర్‌లో ఉంచిన బంగారు, వెండి నగలను చోరీ చేసిన ఘటన మండలంలోని పెదపవనిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పెదపవనిలో నివాసం ఉంటున్న రామిశెట్టి మాలకొండయ్య, కుటుంబసభ్యులు ఓ కార్యక్రమం నిమిత్తం ఒంగోలుకు ఈ నెల ఒకటిన వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలను పగలగొట్టి ఉండటాన్ని గమనించిన పక్కింటివారు ఫోన్ ద్వారా ఆయనకు మంగళవారం తెలియజేశారు. దీంతో ఇంటికి చేరుకున్న ఆయన చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. లాకర్‌లోని 37 సవర్ల బంగారు నగలు, 2.5 కిలోల వెండి వస్తువులను దొంగలు అపహరించుకెళ్లారని గుర్తించి ఎస్సై మహబూబ్ సుభానీకి ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కందుకూరు డీఎస్పీ సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావుతో కలిసి ఇంటిని పరిశీలించారు. వేలిముద్రలను నెల్లూరు నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సేకరించింది.

బాలిక అదృశ్యం విషాదాంతం

కలువాయి: తల్లి మందలించడంతో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఇంటి నుంచి వెళ్లిన బాలిక కలువాయి సమీపంలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మంగళవారం శవమై తేలింది. ఎస్సై సుమన్ వివరాల మేరకు.. కలువాయి ఎస్సీ కాలనీకి చెందిన గోవిందు నిషి (16)ని తల్లి మందలించడంతో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి స్కూటీపై వెళ్లారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి గాలింపు చర్యలను పోలీసులు చేపట్టారు. ఈ తరుణంలో ఉయ్యాలపల్లి సమీపంలో సోమశిల – కండలేరు వరద కాలువ సమీపంలో ఆమె స్కూటీని పోలీసులు గుర్తించారు. కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందనే అనుమానంతో గాలింపు చర్యలను ఎస్సై, సిబ్బంది చేపట్టారు. ఘటన స్థలానికి ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు సీఐ విజయకృష్ణ చేరుకొని సమీక్షించారు. కలువాయి తెలుగుగంగ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో తేలుతున్న నిషి మృతదేహాన్ని మంగళవారం గుర్తించి గజఈతగాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. నిషి తల్లి దివ్యకుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ టోర్నీకి నెల్లూరు క్రీడాకారులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టులో నెల్లూరు క్రీడాకారులు సూర్యతేజ, సుధాకర్ స్థానం దక్కించుకున్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్ కాంక్షించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న బైక్

- వ్యక్తి దుర్మరణం



మనుబోలు: వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని వాహనచోదకుడు మృతి చెందిన ఘటన కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కోట మండలం పుచ్చలపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దిలీప్‌కుమార్‌రెడ్డి (40) నెల్లూరులోని కావేరి ఎస్టేట్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సొంతూరికి బైక్‌పై బయల్దేరారు. ఈ తరుణంలో కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న వాటర్ ట్యాంకర్ అకస్మాత్తుగా మలుపు తిరగడంతో బైక్ అదుపుతప్పి ఢీకొంది. ఘటనలో దిలీప్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన స్థలానికి ఎస్సై రాకేష్ చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



చేజర్ల: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన చేజర్లలోని శివాలయం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చేజర్ల పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని పురుషుడు, మహిళ (35) సోమవారం తిరిగారు. స్థానికంగా ఉన్న శివాలయం వద్ద నిద్రించేందుకు వెళ్లగా, అక్కడి అయ్యప్ప భక్తులు నిరాకరించారు. దీంతో వారిని ప్రాధేయపడటంతో అంగీకరించారు. ఈ తరుణంలో ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని వీరికి అయ్యప్ప భక్తులు ఉదయం ఏడు గంటల ప్రాంతంలో సూచించారు. బయటకొచ్చాక మహిళ కుప్పకూలి మరణించారు. ఈమెతో వచ్చిన వ్యక్తి ఆటో కోసం వెళ్తున్నానంటూ పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి ఇన్‌చార్జి ఎస్సై సైదులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని ఆత్మకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

వేగవంతంగా 'అపార్' కార్డుల మంజూరు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్


నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అపార్ కార్డుల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, అపార్ కార్డుల మంజూరు, ఉపాధి పనిదినాల పెంపు తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు.. స్కూల్ రికార్డుల్లోని వివరాలు సరిపోతే విద్యార్థులకు అపార్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. ఒకవేళ తేడాలుంటే సంబంధిత రికార్డులను సరిచేసి నిర్ణీత ఫారంలో పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన వారి విషయంలో ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు గానూ సంబంధిత పాఠశాలల్లోనే ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసేలా చూడాలని చెప్పారు. తల్లిదండ్రుల కమిటీ సమావేశాలను రాష్ట్రంలో ఈ నెల 14న నిర్వహించనున్నారని వెల్లడించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీలను ఆడిట్ చేసేందుకు గానూ పది మంది అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉపాధి హామీలో పనిదినాలను పెంచాలని ఆదేశించారు. పంచాయతీల్లో క్లోరినేషన్‌ను రోజూ చేపట్టాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవానీ, డీఈఓ బాలాజీరావు, సర్వశిక్ష ఏపీఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కమిటీ సమావేశం

పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే యాజమాన్యాలు సత్వరమే స్పందించి ప్రభుత్వ యంత్రాంగానికి సమాచారం అందించాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై శంకరన్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న ప్రమాదాలు జరిగినా వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కూడిన కమిటీ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పరిశ్రమల ప్రతినిధులు కోరిన విధంగా ముత్తుకూరు పరిసర ప్రాంతంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణం, ఈఎస్‌ఐ వైద్యశాల స్థాయి పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖ జీఎం మారుతిప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ సుష్మ, అగ్నిమాపక శాఖ ప్రతినిధి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.50
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20



అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ అనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గానూ 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి, ప్రణాళిక తయారీపై మండల స్థాయి అధికారులకు నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హాకీ పోటీలు


బాలుర విభాగంలో విజేత కడప జట్టు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో కడప, చిత్తూరు, పశ్చిమగోదావరి జట్లు.. బాలికల విభాగంలో కడప, అనంతపురం, విశాఖపట్నం జట్లు మొదటి మూడు స్థానాలను సాధించాయి. విజేతలకు బహుమతులు, ట్రోఫీలను జిల్లా ఉప విద్యాధికారి ప్రసన్నలక్ష్మి అందజేశారు. సౌత్ మోపూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు అన్వర్‌బాషా, మహబూబ్‌బాషా, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పెంచలయ్య, శ్రీనివాసులు గురుప్రసాద్, కరిముల్లాఖాన్, రవిరాజా, సెల్వపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



మనుబోలు: కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ఇద్దరు గాయపడిన ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన పద్మనాభం, రీనా కారులో చెన్నై బయల్దేరారు. ఈ క్రమంలో ప్రమాదాల నియంత్రణ కోసం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద హైవేపై ఏర్పాటు చేసిన డ్రమ్ములను కారు ఢీకొనడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటివారిపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని సీఏఎం స్కూల్ ప్రాంతానికి చెందిన సమీనాకు అనంతసాగరం మండలం మినగల్లుకు చెందిన మస్తాన్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ.50 వేల నగదు, ఐదు సవర్ల బంగారు తదితరాలను కట్న కానుకల కింద మస్తాన్ కుటుంబసభ్యులకు ఇచ్చారు. కొద్ది రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధించసాగారు. ఇంటి నుంచి కొంతకాలం క్రితం గెంటేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే 'కౌశల్'

నెల్లూరు (టౌన్): విద్యార్థుల్లో పోటీతత్వం, సృజనాత్మకతను వెలికితీసేందుకే కౌశల్ పోటీలను నిర్వహిస్తున్నామని డీఈఓ బాలాజీరావు పేర్కొన్నారు. కౌశల్‌కు సంబంధించిన పోస్టర్లను నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు క్విజ్, పోస్టర్లు తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 15లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక్కో పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులకు ఈ పోటీల్లో అవకాశం కల్పించనున్నామని చెప్పారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 20 నుంచి 22 వరకు.. జిల్లా స్థాయిలో డిసెంబర్ 6న.. రాష్ట్రస్థాయిలో 30న పోటీలను ఆన్‌లైన్లో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఎంఈఓ తిరుపాల్, కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, జాయింట్ కోఆర్డినేటర్ రఘుకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 128	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 258
లేయర్ (లైవ్)	: 110		
బ్రాయిలర్ చికెన్	: 232	లేయర్ చికెన్	: 187